లేసు ఉత్పత్తుల తయారీలో ప్రావీణ్యం పొందాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - నరసాపురం

లేసు వస్తువుల తయారీలో ఆకర్షణీయత కనబడితే దానికి మార్కెట్ ఉంటుంది, ఆ విధంగా మహిళలు లేసు ఉత్పత్తుల తయారీలో ప్రావీణ్యం సాధించాలని ఆర్‌డిఒ దాసి రాజు తెలిపారు. శుక్రవారం మండలంలోని రుస్తుంబాద లేసు ట్రేడింగ్ సెంటర్లో నిర్వహించిన ట్రెయినింగ్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ దాసి రాజు మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా డిజైన్లు నేర్చుకోవాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా లేసు టాయ్ బొమ్మలకు మంచి డిమాండ్ ఉందన్నారు. మహిళలు ట్రెయినింగ్‌లో మెళకువలు, తయారీ విధానంపై పట్టు సాధించాలన్నారు. కన్వీనర్ కలవకొలను తులసి మాట్లాడుతూ 30 రోజులపాటు లేసు మహిళలకు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కలవకొలను తాతాజీ, శ్రీరామచంద్రుడు, రవీంద్ర గౌతమ్, శ్రీలక్ష్మి, సుగుణరాజు, చినమిల్లి దివాకర్ పాల్గొన్నారు.

జెడ్‌పి ఛైర్‌పర్సన్‌పై తిరుగుబాటు..!

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసిలు

31 మంది వైసిపి జెడ్‌పిటిసిల సమావేశం
పార్టీ ఫిరాయింపుల్లో భాగంగా అనర్హత వేటుకు పట్టు
11న జెడ్‌పి అత్యవసర సమావేశానికి ఏర్పాట్లు
జెడ్‌పి స్టాండింగ్ కమిటీ సమావేశాల బహిష్కరణ
రోజంతా జెడ్‌పిలో హైడ్రామా, అధికారుల నిరీక్షణ
కోరం లేకపోవడంతో స్టాండింగ్ కమిటీ సమావేశాలు వాయిదా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా పరిషత్ ఛైర్మన్ గంటా పద్మశ్రీపై, అదే పార్టీకి చెందిన వైసిపి జెడ్‌పిటిసిలు తిరుగుబాటుకు దిగారు. వైసిపి తరపున గెలిచి పార్టీ ఫిరాయించిన జెడ్‌పి ఛైర్మన్‌పై పంచాయతీరాజ్ చట్టప్రకారం అనర్హత వేటు వేయాలని 31 మంది జెడ్‌పిటిసిలు సమావేశమై డిమాండ్ చేసిన పరిస్థితి నెలకొంది. శుక్రవారం జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాల నిర్వహణకు జెడ్‌పి సిఇఒ ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లా పరిషత్ ఏడు స్టాండింగ్ కమిటీ సమావేశాలకు సంబంధించి కచ్చితమైన సమయం నిర్ధారించి ప్రకటించారు. దీంతో ఉదయం పది గంటలకే జిల్లా అధికారులు, జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ జెడ్‌పికి చేరుకున్నారు. ఏలూరు వచ్చిన జెడ్‌పిటిసి సభ్యులు మాత్రం జిల్లా పరిషత్‌కు మాత్రం రాలేదు. 31 మంది జెడ్‌పిటిసిలు స్థానిక వైసిపి కార్యాలయంలో సమావేశం నిర్వహించుకున్నారు. ఈ సమావేశానికి వైసిపి ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల ఇన్‌ఛార్జులు దూలం నాగేశ్వరరావు, ముదునూరి ప్రసాద్‌రాజుతోపాటు, ఏలూరు జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులంతా హాజరయ్యారు. సమావేశం అనంతరం జెడ్‌పిటిసిలు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీని పార్టీ ఫిరాయింపుల చట్టం కింద పదవికి అనర్హురాలిగా ప్రకటించాలని కోరారు. వైసిపి గుర్తుపై గెలిచి పద్మశ్రీ జెడ్‌పి ఛైర్‌పర్సన్ అయ్యారని తెలిపారు. పంచాయతీరాజ్‌చట్టం 194 (1) ప్రొవిజన్ ప్రకారం పార్టీ విప్‌ని ధిక్కరించి వేరే పార్టీలో చేరారని, వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైసిపికి 46 మంది జెడ్‌పిటిసి సభ్యులుండగా గంటా పద్మశ్రీ పార్టీ మారారు. కవురు శ్రీనివాస్ రాజీనామాతో యలమంచిలి స్థానం ఖాళీగా ఉంది. ఇంకా వైసిపికి 44 మంది సభ్యులుండగా శుక్రవారం జరిగిన సమావేశానికి 31 మంది మాత్రమే హాజరయ్యారు. ఇంకా 13 మంది జెడ్‌పిటిసి సభ్యులు సమావేశానికి హాజరు కాలేదు.

11న జెడ్‌పి అత్యవసర సమావేశం

జెడ్‌పి ఛైర్‌పర్సన్ వ్యవహారంపై తాడోపేడో తేల్చుకునేందుకు జెడ్‌పి అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలని వైసిపి జెడ్‌పిటిసిలు సెప్టెంబర్ 28నే జెడ్‌పి సిఇఒకు వినతి ఇచ్చారు. తర్వాత కలెక్టర్‌ను సైతం కలిశారు. అయితే అప్పుడు అధికారులు స్పందించలేదు. ఈ నెల 11న అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్లు జిల్లా పరిషత్ అధికారులు తెలిపారు. అంతకు ముందుగానే స్టాండింగ్ కమిటీ సమావేశాలు పూర్తి చేయాలని నిర్ణయించారు. దీన్ని వైసిపి జెడ్‌పిటిసిలు వ్యతిరేకించడంతో కోరం లేక స్టాండింగ్ సమావేశాలు వాయిదా పడ్డాయి. అత్యవసర సమావేశంలో ఏం జరుగుతుందోననే చర్చ సర్వత్రా సాగుతోంది. 2021లో జిల్లా పరిషత్ ఎన్నికలు జరిగాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని మొత్తం 48 జెడ్‌పిటిసి స్థానాలకుగాను 46 చోట్ల వైసిపి గెలిచింది. ఆచంట, వీరవాసరంలో టిడిపి, జనసేన గెలిచాయి. దీంతో జెడ్‌పి ఛైర్మన్ పదవి బిసి సామాజిక తరగతికి రిజర్వు చేయడంతో యలమంచిలి జెడ్‌పిటిసిగా గెలిచిన కవురు శ్రీనివాస్ జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. 2021 సెప్టెంబర్ 16న కవురు ప్రమాణ స్వీకారం చేశారు. తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో కవురు శ్రీనివాస్ స్థానిక సంస్థల ఎంఎల్‌సి అభ్యర్థిగా బరిలోకి దిగి గెలుపొందారు. దీంతో జెడ్‌పి ఛైర్మన్ పీఠం ఖాళీ అయ్యింది. బిసి సామాజిక తరగతికి చెందిన పెదపాడు జెడ్‌పిటిసి గంటా పద్మశ్రీని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గా వైసిపి ఎంపిక చేసింది. 2023 జూన్ ఎనిమిదో తేదీన జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గా ఆమె బాధ్యతలు చేపట్టారు. ఈ ఏడాది మేలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి కూటమి అఖండ విజయం సాధించింది. దీంతో జిల్లాలో రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోయాయి. రెండు నెలల క్రితం గంటా పద్మశ్రీ, ఆమె భర్త ప్రసాద్ టిడిపిలో చేరారు. దీంతో వైసిపి ఎంఎల్‌ఎలు ఎదురుతిరిగారు. పార్టీ ఫిరాయింపుల్లో భాగంగా పద్మశ్రీపై అనర్హత వేటు వేయాలని కోరుతున్నారు. స్థానిక సంస్థల నిబంధనల ప్రకారం నాలుగేళ్ల వరకూ అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు వీలులేదు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ పదవి నుంచి ఆమెను అనర్హురాలిగా ప్రకటించాలన్నా పెద్ద ప్రక్రియ ఉంది. 11న జరిగే అత్యవసర సమావేశంలో ఎటువంటి తీర్మానం చేస్తారో చూడాలి. అధికార పార్టీలోకి చేరడంతో జెడ్‌పి ఛైర్‌పర్సన్‌కు ఎటువంటి ఇబ్బంది ఉండదనే చర్చ నడుస్తోంది. ఏం జరుగుతుందో వేచిచూడాలి.

కోరం లేక స్థాయి సంఘాల సమావేశాలు వాయిదా

జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ

స్థాయి సంఘాల సమావేశాలకు జెడ్‌పిటిసి సభ్యులు హాజరు కాకపోవడంతో కోరం లేక వాయిదా వేస్తున్నట్లు జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీతోపాటు, జెడ్‌పి సిఇఒ సుబ్బారావు తెలిపారు. 11న అత్యవసర జెడ్‌పి సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు సిఇఒ చెప్పారు.

వంకా, కవురుపై జెడ్‌పిటిసిల ఆగ్రహం..

వైసిపి కార్యాలయంలో సమావేశమైన ఆ పార్టీ జెడ్‌పిటిసిలంతా స్థానిక సంస్థల ఎంఎల్‌సిలుగా గెలుపొందిన వంకా రవీంద్ర, కవురు శ్రీనివాస్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. జెడ్‌పిటిసిల ఓట్లతో గెలిచి ఎంఎల్‌సిలు అయిన ఈ నాయకులు జిల్లా పరిషత్‌లో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడినా స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నించినట్లు తెలిసింది. పదవులు అనుభవించిన నాయకులు జెడ్‌పిటిసి సమస్యలను గాలికొదిలేశారంటూ మండిపడినట్లు సమాచారం. వైసిపి హయాంలో కవురు శ్రీనివాస్‌కు అత్యంత ప్రాధాన్యత ఉండేది. డిసిసిబి ఛైర్మన్‌గా, జెడ్‌పి ఛైర్మన్‌గా, ఎంఎల్‌సిగా మూడు పదవులను ఆయనకు వైసిపి కట్టబెట్టింది. వంకా రవీంద్రకు ఎంఎల్‌సి ఇచ్చి గెలిపించుకున్న పరిస్థితి ఉంది. ఈ నాయకులు ఇప్పుడు ఎక్కడా కనిపించడం లేదని జెడ్‌పిటిసిల సమావేశంలో చర్చకు వచ్చినట్లు సమాచారం.

ముగ్గురు కలెక్టరేట్ ఉద్యోగులపై వేటు

వేరే ప్రాంతానికి మరో ఇద్దరు ఉద్యోగుల బదిలీ
ఉత్తర్వులు జారీచేసిన జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

కలెక్టరేట్‌లోని రెవెన్యూ విభాగంలో పనిచేస్తున్న ముగ్గురు అధికారులపై వేటుపడింది. మరో ఇద్దరు అధికారులను వేరే ప్రాంతానికి బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెవెన్యూ విభాగంలోని కొంతమంది ఉద్యోగులపై వివిధ రకాల ఆరోపణలు వెల్లువెత్తడంతో వాస్తవాలను పరిశీలించేందుకు కలెక్టరేట్లోని పలు సెక్షన్లను జిల్లా కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. రికార్డులు సరిగ్గా నిర్వహించకపోవడం, ఫైల్స్ నిర్ణీత గడువులో క్లియర్ చేయకపోవడం, సక్రమంగా విధులు నిర్వహించకపోవడం, గ్రీవెన్స్ పట్ల నిర్లక్ష్యం వహించడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మెజిస్టీరియల్ సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ ఎస్‌కె.షకీల్, కోఆర్డినేషన్ సెక్షన్ జూనియర్ అసిస్టెంట్ కె.జీవన్‌కుమార్, ఎస్టాబ్లిష్మెంట్ సెక్షన్ జూనియర్ అసిస్టెంట్ యు.దివ్య స్మైలీని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే కోఆర్డినేషన్ సెక్షన్ జూనియర్ అసిస్టెంట్ ఐవిబిపి తేజను ఆచంట తహశీల్దార్ కార్యాలయానికి, మెజిస్టీరియల్ సెక్షన్ జూనియర్ అసిస్టెంట్ యు.వెంకట్‌కుమార్‌ను పెనుగొండ తహశీల్దార్ కార్యాలయానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలని, సకాలంలో ఫైల్స్ క్లియర్ చేయడంతో పాటు, ప్రజల ఆర్థిక ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఉద్యోగిపై ఉందని కలెక్టర్ తెలిపారు.

అపార్ ప్రత్యేక క్యాంపుల షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 12 నుంచి అపార్ ఐడి జనరేషన్‌కు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కాలేజీల విద్యార్థులకు అపార్ ఐడి జనరేషన్ చేసేందుకు అవసరమైన ఆధార్ కార్డు డేటా సవరణలకు అన్ని మండలాలు, మున్సిపాల్టీల్లోని గ్రామ, వార్డు సచివాలయాల్లో 90 ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్స్, హెడ్మాస్టర్లకు తెలియజేయాలన్నారు. జిల్లాలో ఈ నెల 12 నుంచి 28వ తేదీ వరకూ జిల్లా అంతటా ప్రత్యేక మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆచంట రూరల్‌లో 2 గ్రామాలు, ఆకువీడులో 4, అత్తిలి రూరల్‌లో 3, భీమవరం రూరల్‌లో 6, భీమవరం అర్బన్‌లో 4, యలమంచిలిలో 4, గణపవరంలో 4, ఇరగవరం రూరల్‌లో 3, కాళ్లరూరల్‌లో 4, మొగల్తూరు రూరల్‌లో 4, నరసాపురం అర్బన్‌లో 4, నరసాపురం రూరల్‌లో 3, పాలకొల్లు రూరల్‌లో 4, పాలకొల్లు అర్బన్‌లో 3, పాలకోడేరులో 3, పెంటపాడు రూరల్‌లో 2, పెనుగొండలో 3, పెనుమంట్రలో 3, పోడూరులో 4, తాడేపల్లిగూడెం రూరల్‌లో 4, తాడేపల్లిగూడెం అర్బన్‌లో 4, తణుకురూరల్‌లో 2, తణుకుఅర్బన్‌లో 6, ఉండి రూరల్‌లో 3, వీరవాసరంలో 4 గ్రామాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

నిర్ణీత ధరకే ఇసుక : కలెక్టర్

ఇసుక వినియోగదారుడు నేరుగా ఫెసిలిటేషన్ సెంటర్‌కు ఫోన్ చేసి నిర్ణీత ధరకే ఇసుక రవాణా వాహనాలు పొందొచ్చనని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఇసుక కొరత కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వినియోగదారులకు మరింత సులువుగా ఇసుక పొందేందుకు రీచ్‌లు అందుబాటులో ఉంచడంతోపాటు, నిర్ణీత ధరలకే రవాణా వాహనాలను ఏర్పాటు చేయడానికి కూడా జిల్లా యంత్రాంగం చేసిన ప్రయత్నాలు ఫలించాలని తెలిపారు. జిల్లాలోని ట్రాన్స్‌పోర్ట్‌లతో పలు దఫాలుగా చర్చించిన మీదట ఇసుక రవాణాకు నిర్ణీత ధరలకు వెహికల్స్ అందుబాటులో ఉంచేందుకు ముందుకొచ్చారని తెలిపారు. జిల్లాలోని ఇసుక వినియోగదారులు అధిక రవాణా ఛార్జీలు చెల్లించి ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని, జిల్లా కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన ఇసుక ఫెసిలిటేషన్ సెంటర్ నంబర్లకు 93914 45753, 86682 91997, 81869 39223, 95501 75144 ఫోన్ చేసి వాహనాన్ని ఇసుక రవాణాకు పొందొచ్చని తెలిపారు. సంబంధిత వాహనంలో వినియోగదారుడు నేరుగా రీచ్‌కు చేరుకుని ఆధార్ కార్డు ద్వారా ఉచిత ఇసుకను లోడింగ్ ఛార్జీలతో పొందొచ్చని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

సమస్యల పరిష్కారానికి 'ప్రజాపోరు'

14న తహశీల్దార్ కార్యాలయం, 15న కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలి : సిపిఎం

ప్రజాపోరు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - భీమవరం

అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలపై, పిల్లలపై దళితులపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రయివేటీకరణ ఆపాలని కేంద్ర ప్రభుత్వం ప్రజల ముందు తీసుకొచ్చిన జెమిలి ఎన్నికలను వ్యతిరేకించాలని భీమవరం వివిధ వార్డుల్లో ప్రజా పోరు ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు మాట్లాడారు. ధరలను అదుపు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. పరిశ్రమలు మూసివేసి నిరుద్యోగం పెంచిందన్నారు. కార్పొరేట్లకు రాయితీలిస్తూ ప్రజలు కొనుగోలు శక్తిని తగ్గించిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 15న జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం జిల్లా నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ, ఎం.వైకుంఠరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బొక్కా సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, డి.త్రిమూర్తులు, డి.నాగేశ్వరరావు, కె.కృష్ణ, ఎ.రాంబాబు పాల్గొన్నారు.

నరసాపురం : సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 8 నుండి 14వ తేదీ వరకూ ప్రజా సమస్యల పరిష్కారానికై ప్రజా పోరు నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం తెలిపారు. స్థానిక మీరా గ్రంథాలయంలో ప్రజాపోరు పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ అధిక ధరలు, నిరుద్యోగం సమస్య, మహిళలు, చిన్నపిల్లలు, దళితులపై అత్యాచారాలు అరికట్టాలని, జమిలీ ఎన్నికలు ప్రజాస్వామ్య వ్యవస్థకు రాష్ట్రాల హక్కులకు భంగం వాటిల్లుతోందని తెలిపారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ వంటి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి నిరసనగా 8 నుంచి 14వ తేదీ వరకూ జిల్లాలో ప్రజాపోరు పేరుతో ఇంటింటికీ ప్రచార కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రజలను సమీకరించి 14న మండల కార్యాలయాల వద్ద, 15న జిల్లా కలెక్టరేట్, ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్, కవురు పెద్దిరాజు, బి.కళ్యాణి, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు పాల్గొన్నారు.

తణుకు : కూటమి ప్రభుత్వం పెరుగుతున్న ధరలు అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైందని సిపిఎం పట్టణ కార్యదర్శి పి.వి.ప్రతాప్ విమర్శించారు. ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకూ ప్రజాపోరు నేపథ్యంలో శుక్రవారం స్థానిక అమరవీరుల భవనం నుంచి ఇంటింటికీ సిపిఎం ఆధ్వర్యంలో ప్రదర్శనగా వెళ్లి రైల్వేస్టేషన్ రోడ్డు, బ్యాంకు కాలనీ, ప్రధాన రద్దీ ప్రదేశాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభల్లో ప్రతాప్ మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం వచ్చినప్పటికీ ప్రజలపై భారాలు వేయడం ఆగలేదన్నారు. ధరలు పెరుగుతున్నా ప్రజల ఆదాయాలు మాత్రం పెరగడం లేదని విమర్శించారు. ధరలు తగ్గించాలని 14వ తేదీన కోరుతూ తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకుడు గార రంగారావు, పి.గణేష్, జన్యాల బంగారమ్మ, ఉషా, శ్రీను, భాస్కరరావు పాల్గొన్నారు.

భీమవరం : పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

సాధనతోనే విజయం సాధ్యం

క్రీడా పోటీలను ప్రారంభించిన కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరంటౌన్

విద్యతో పాటు వివిధ క్రీడల్లో సాధన చేసి బాల బాలికలు విజయం సాధించాలని స్కూల్ గేమ్స్ జిల్లా ఛైర్మన్ జిల్లా కలెక్టర్ నాగరాణి అన్నారు. శుక్రవారం స్థానిక చింతలపాటి బాపిరాజు స్మారక ఉన్నత పాఠశాలలో ప్రారంభమైన 68వ రాష్ట్ర అండర్-14, అండర్-17, అండర్-19 అంతర్ జిల్లాల మాల్కంబ్, రోప్ స్కిప్పింగ్ పోటీలను కలెక్టర్ ప్రారంభించి ప్రసంగించారు. ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి ఈ క్రీడలను సోపానంగా వినియోగించుకోవాలన్నారు. ఓటమి చెందినవారు నిరాశ నిస్పృహలకు గురి కావొద్దన్నారు. ముందుగా జ్యోతిని వెలిగించడంతోపాటు జాతీయ జెండాను కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లా విద్యాధికారి రమణ కార్యక్రమానికి అధ్యక్షత వహించి ప్రసంగించారు. డిఎన్‌ఆర్ కళాశాల అసోసియేషన్ అధ్యక్షులు గోకరాజు నరసింహరాజు కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), ఉపాధ్యక్షులు గోకరాజు పాండురంగరాజు, జాయింట్ సెక్రటరీ, చింతలపూడి బాపిరాజు స్కూల్ కరెస్పాండెంట్ కూనపురాజు రామకృష్ణంరాజు, బోస్ పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

కొనసాగిన విఒఎల నిరసన

ప్రజాశక్తి - ఆచంట

విఒఎలకు ఎనిమిది నెలల బకాయి వేతనాలు టిడిపి కూటమి ప్రభుత్వం తక్షణం చెల్లించాలని సిఐటియు సీనియర్ నాయకులు తలుపూరి బుల్లబ్బాయి, తోటపల్లి సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో విఒఎల సమస్యలు పరిష్కరించాలని, కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ జి.కనకరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విఒఎల ఉపాధిని దెబ్బతీసే మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా మార్టులో బలవంతపు సరుకుల కొనుగోలు ఆపాలన్నారు. తక్షణం ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కుసుమే జయరాజు, విఒఎలు లక్ష్మీపార్వతి, విజయ, సిహెచ్ లక్ష్మి, రేఖ, ఆరుపల్లి బేబీ, ఉషారాణి, దమయంతి, రామలక్ష్మి, పద్మలత, స్వప్న దేవి, మట్టపర్తి నాగమణి పాల్గొన్నారు.

మొగల్తూరు : విఒఎల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మొగల్తూరులోని రెవెన్యూ కార్యాలయం వద్ద విఒఎలు చేపట్టిన నిరసన శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాలుగు నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, అక్రమంగా తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, మహిళా మార్ట్‌ల్లో బలవంతపు సరుకులు కొనుగోలు ఆపాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ కె.రాజకిశోర్, ఎంపిడిఒ సిహెచ్ త్రిశూలపాణికి వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో మేళం అంజలీదేవి, రేపు విజయ, వాటాల వెంకటలక్ష్మి, దొంగ పార్వతి, బర్రి అలివేలుమంగ, కొల్లాటి రాజేశ్వరి, పేపకాయల ముత్యాలమ్మ పాల్గొన్నారు.

పెనుగొండ : మహిళా మార్టుల్లో బలవంతపు సరుకుల కొనుగోలు ఆపాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాల వద్ద విఒఎలు ధర్నాలు నిర్వహించి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్షుడు నాగిశెట్టి గంగారావు మాట్లాడుతూ విఒఎల బకాయి వేతనాలు చెల్లించాలని, కాల పరిమితి సర్క్యులర్ రద్దుచేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ముందుగా బస్టాండ్ నుండి మెయిన్ రోడ్డులో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ బి.అనిత కుమారికు, ఎండిఒ సూర్యనారాయణ మూర్తికి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు షేక్ పాదుషా, సిఐటియు నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, మాదాసు నాగేశ్వరరావు, గుర్రాల సత్యనారాయణ, విఒఎలు పాల్గొన్నారు.

ఆచంటలో నిరసన తెలుపుతున్న విఒఎలు

నిరసనలు పట్టించుకోరా

విద్యుత్ కట్ చేయడాన్ని నిరసిస్తూ సిపిఎం వినతి

ప్రజాశక్తి - ఆకివీడు

రోడ్డు పక్కన ఉంటున్న నివాసితులకు ముందస్తు సమాచారం గానీ, నోటీసులు గానీ ఇవ్వకుండానే ఏడో తేదీ రాత్రి విద్యుత్ అధికారులు విద్యుత్ తీసివేశారని, సమస్యను అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్ వివరించారు. శుక్రవారం సాయంత్రం ఆయన బాధితులతో కలిసి డిఆర్‌ఒ వెంకటేశ్వర్లును కలిసి సమస్యను వివరించి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అప్పటికప్పుడు అత్యవసరంగా రాత్రి నిరసన తెలిపినా కనీసం పట్టించుకోలేదన్నారు. ఈ రకమైన ఎంఎల్‌ఎ విధానం సరికాదన్నారు. దీనిపై డిఆర్‌ఒ సమస్యను కలెక్టర్‌కు తెలియజేసి పరిష్కరిస్తామని, సోమవారం నాటికి పట్టాలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారని తెలిపారు. ఆయన వెంట సిపిఎం నాయకులు పెంకి అప్పారావు ఉన్నారు.

పేదల ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ తీసేసి వేధించడం బ్రిటీష్ పాలన గుర్తుకు తెస్తోందని సిపిఎం మండల కార్యదర్శి కె.తవిటినాయుడు అన్నారు. ఐ.భీమవరం రోడ్డులో ఆకివీడు 12వ వార్డులో రోడ్డు పక్కన ఉన్న ఇళ్లకు గురువారం రాత్రి విద్యుత్ అధికారులు విద్యుత్ కట్ చేశారు. ఇటువంటి చర్యలను నిరసిస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద బాధితులు సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తవిటినాయుడు మాట్లాడారు. తీసివేసిన ఇళ్లకు వెంటనే విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇల్లు ఖాళీ చేయాల్సిన వారికి మౌలిక వసతులతో కూడిన స్థలాలు, పట్టాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డోకల రవితేజ, సందక సూరిబాబు, గేదెల విజయ లావణ్య, జి.ధనుష్, బాధితులు పాల్గొన్నారు.

డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు గోపాలన్, నివాసితులు

విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

నగర పంచాయతీ, పరిసర గ్రామాల్లో పేదల ఇళ్లకు నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ సరఫరాను నిలిపివేసిన ఆకివీడు విద్యుత్ ఎఇపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని పౌరుల సంక్షేమ సంఘం కన్వీనర్ బివి.వర్మ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చుట్టుపక్కల పోరంబోకు స్థలాల్లో 50 సంవత్సరాల పైబడి నివసిస్తున్న పేదల ఇళ్లకు స్థానిక విద్యుత్ ఎఇ విద్యుత్ సరఫరా నిలిపివేయాలని కిందిస్థాయి అధికారులకు ఆదేశాలిస్తున్నారని చెప్పారు. ఎఇ చట్ట విరుద్ధంగా, నిబంధనలను తుంగలోతొక్కి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్నారు. తక్షణం ఎఇపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గ్రామంలో సమస్యలు పరిష్కరించాలి

మత్స్యపురిపాలెం పంచాయతీ వద్ద సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - వీరవాసరం

స్వచ్ఛమైన తాగునీరందించాలని, తాగునీటి చెరువుకు తక్షణం మరమ్మతులు చేయాలని, కాలుష్యాన్ని అరికట్టాలని, గ్రామంలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మత్స్యపురిపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం మండల కన్వీనర్ పోతుల మృత్యుంజయ అధ్యక్షతన జరిగిన సభలో సిపిఎం నాయకులు జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ తాగునీటి చెరువు కలుషితమై, చేపలు చనిపోయి, కాలుష్య కోరల్లో గ్రామం ఉంటే సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారని విమర్శించారు. అధికారుల నిర్లక్ష్యానికి గ్రామ ప్రజలు ప్రాణాలు అర్పించాలా అని విమర్శించారు. గ్రామంలో డ్రెయినేజీ సరిగ్గా లేక వాడకం నీరు, వర్షం, మురుగునీరు తాగునీటి చెరువులో కలిసి కలుషితమై కంపు కొడుతున్నా అధికారులు పట్టించుకోరా అని ప్రశ్నించారు. 33 సంవత్సరాల క్రితం మరమ్మతులు చేసిన చెరువును ఇప్పటి వరకూ అధికారులు పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. గ్రామంలో సరిగ్గా పనిచేయని కార్యదర్శులపై ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు. విషజ్వరాలు, టైఫాయిడ్, మలేరియా జ్వరాలతో గ్రామస్తులు అల్లాడిపోతుంటే, ఐదు నెలలుగా గ్రామంలో పారిశుధ్యం చేయించకుండా గ్రామ కార్యదర్శులు ఏం చేస్తున్నారన్నారు. జిల్లా పంచాయతీ అధికారులు కూడా పట్టించుకోరా అని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా పంచాయతీ అధికారులు తక్షణం గ్రామాన్ని సందర్శించి వెంటనే పంచాయతీకి నిధులు కేటాయించాలని, యుద్ధ ప్రాతిపదికన చెరువుకు మరమ్మతులు చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన కార్యదర్శులపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని 11వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నాకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గోడి దావీదు, గునుపూడి చందు, నల్లి బాబూరావు, గుణుపూడి సుందరరావు, అంబటి భూషణం, నల్లి రవి, బండిల మణిరాజు, కర్తక ప్రేమానంద్, పులగం బాలు, గనుపూడి సన్నీ పాల్గొన్నారు.

మత్స్యపురిపాలెం పంచాయతీ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న గ్రామస్తులు

జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.కిరణ్‌శ్రీ

తాడేపల్లిగూడెం : ప్రజలందరికీ న్యాయం అందాలని, ఉచిత న్యాయ సహాయం, అదాలత్ గురించి 1987 చట్టం వివరిస్తుందని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.కిరణ్‌శ్రీ తెలిపారు. తాడేపల్లిగూడెం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాష ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బార్ అసోసియేషన్ హాల్‌లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్య కిరణశ్రీ మాట్లాడుతూ ఈ విజ్ఞాన సదస్సుల ద్వారా 1987 చట్టం గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. డిసెంబర్ 14వ తేదీన తేదీన జరుగబోవు జాతీయ లోక్ అదాలత్‌కు న్యాయవాదులందరూ సహకరించాలని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఇ.అన్నామణి, బార్ వైస్ ప్రెసిడెంట్ కంకట శ్రీనివాసరావు, లీగల్ ఎయిడ్ అడ్వకేట్ మాకా సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా వసతిగృహ వార్షికోత్సవ వేడుకలు

తాడేపల్లిగూడెం : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ క్యాంపస్‌లో మహిళల వసతిగృహ మొదటి వార్షిక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రొఫెసర్, హాస్టల్ చీఫ్ వార్డెన్ టి.అశోక్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉమెన్స్ హాస్టల్ డిప్యూటీ వార్డెన్ డాక్టర్ ఎస్.ప్రశాంతి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ అశోక్ మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తిగత అభివృద్ధిలో హాస్టల్ జీవితం ప్రాముఖ్యతను, సహచరుల మధ్య కరుణ, స్నేహ భావాలను పెంపొందించడం వంటి నైపుణ్యాలను ఆయన విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థుల మధ్య మంచి సత్సంబంధాలు, బంధాలను పెంపొందించడంతోపాటు భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు కొనసాగించాలనే ఆయన తెలిపారు. వివిధ విభాగాలకు చెందిన హాస్టల్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

అఖండ అన్నసమారాధన

ప్రజాశక్తి - నరసాపురం

అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న నీలిమ

పట్టణంలోని 7వార్డు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ యతిరాజారామ్మోహన్ నాయుడు ఇంటి వద్ద ఉన్న పుంతలో ముసలమ్మ ఆలయ ప్రాంగణం వద్ద శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. సుమారు రెండు వేల మంది భక్తులు విచ్చేసి స్వామివారి ప్రసాదాలు స్వీకరించారు. ఈ సమారాధనను ఎంఎల్‌ఎ నాయకర్, కొవ్వలి ఫౌండేషన్ ఉపాధ్యక్షులు నిమ్మకాయల నీలిమలు ప్రారంభించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వాములు, భవానీలకు ప్రసాదాలు వడ్డించారు. అనంతరం కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. సంకు భాస్కర్ నాయుడు, కోటిపల్లి సురేష్, వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

దేవాంగులకు న్యాయం చేయాలి

పాలకొల్లు : నామినేటెడ్ పదవుల నియామకంలో దేవాంగులకు రాష్ట్ర ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని స్థానిక వీవర్స్ కమ్యూనిటీ హాల్లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో పలువురు దేవాంగ నేతలు వాపోయారు. రాష్ట్రంలో చేనేత జనాభాలో 16 లక్షల జనాభా పైబడి ఉన్న దేవాంగులకు నామినేటెడ్ పదవుల్లో తీవ్ర అన్యాయం జరిగిందని, చేనేత వర్గానికి ఒక్క పదవి ఇచ్చి, మిగిలిన వారికి ఒక్క నామినేటెడ్ పదవి కూడా ఇవ్వలేదని తెలిపారు. గతంలో మాదిరి దేవాంగ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ఎంఎల్‌సితో పాటు, ప్రముఖ దేవస్థానంలు, తదితర నామినేటెడ్ పదవులను జనాభా ప్రాతిపదికన సిఎం చంద్రబాబు తమపై దృష్టి సారించి సముచిత స్థానం కల్పించాలని కోరుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా గౌరవ అధ్యక్షులు వట్టం గణేష్, అధ్యక్షులు కూర్మా శివగణేష్, కార్యదర్శి మానెం బసవరాజు, ఉపాధ్యక్షులు బాసిన సత్యనారాయణ, ట్రెజరర్ యర్రా శివాజీ, ముఖ్య సలహాదారులు బాసిన గుణేశ్వరరావు, వట్టం భాస్కరరావు, సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి రొబ్బి భాస్కరరావు పాల్గొన్నారు.

బిసిలకు సముచిత స్థానం కల్పించాలి

కాళ్ల : రాష్ట్రంలో బిసిలకు చదువుతో పాటు ఉద్యోగ, రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించాలని బిసి ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు గూడూరి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. సీసలి గ్రామంలో బిసి సంఘం ప్రతినిధులతో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి బిసి మండల అధ్యక్షులు యలమంచిలి వెంకటరమణ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన బిసి ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు గూడూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జనగణనలో సమగ్ర కులగణన వెంటనే చేపట్టాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ 44 శాతం పెంచాలన్నారు. బిసిల పక్షపాతిగా చెప్పుకునే టిడిపి తమకు అని రంగాల్లో గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 12వ తేదీన భీమవరం చంద్రిక ఫంక్షన్ హాల్‌లో జాతీయ ప్రజా సంక్షేమ సంఘం ప్రతినిధుల సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. బిసిలు ఎదుర్కొనే సమస్యలపై పూర్తిస్థాయి చర్చ నిర్వహించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు మంతెన నాగ ఆంజనేయులు, బొత్స గణేష్, గుర్రం సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణ తగదు

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్

ఆచంట : ఎస్‌సి వర్గీకరణ విషయంలో మాల ప్రజాప్రతినిధులు గొంతు ఎత్తకపోవడం దారుణమని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. శుక్రవారం ఆచంట గ్రామంలో మాల మహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మాదిగ ప్రజాప్రతినిధులు కలిసి వర్గీకరణపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరడం దీనిపై చంద్రబాబు స్పందించి త్వరలో నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని చెప్పడం దారుణమన్నారు. మాల ప్రజాప్రతినిధులు మన జాతికి జరుగుతున్న నష్టంపై ఎందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దగ్గర గొంతు ఎత్తడం లేదని విమర్శించారు. రానున్న రోజుల్లో మాలల సత్తా ఏంటో చూపిస్తామని పుష్పరాజ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నేతల సువర్ణరాజు, జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు నేతల సాల్మన్ రాజు, జిల్లా అధ్యక్షులు ఇంటి సుందర్ కుమార్ పాల్గొన్నారు.

పట్టణ ఎస్‌ఐగా బాదం శ్రీనివాసరావు

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం పట్టణ ఎస్‌ఐగా బాదం శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన భీమవరం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో శాంతిభద్రతలు సక్రమంగా నిర్వహిస్తానని, పట్టణ ప్రజలు శాంతిభద్రతలకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేరాలు - ఘోరాలు

వేర్వేరు ఘటనల్లో ఇద్దరిపై కేసు

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో రెండు కేసులు నమోదుచేసి ఇద్దరి ముద్దాయిలను అరెస్టు చేసినట్లు తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ కెఎస్‌వి.కళ్యాణ్ చక్రవర్తి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. భీమవరం ఇఎస్‌టిఎఫ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎల్.రమాదేవి వారి సిబ్బంది, తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మురళీమోహన్, సిబ్బందితో శుక్రవారం గణపవరం మండలం ఎస్.కొండెపాడు గ్రామంలో సారా తయారీకు నిల్వ ఉంచిన 100 లీటర్ల పులియ పెట్టిన బెల్లపు ఊటను కనుగొన్నారు. బెల్లపు ఊటను ధ్వంసం చేసి ఒకవ్యక్తిని అరెస్టు చేసామని, తాడేపల్లిగూడెం సంత మార్కెట్ సమీపంలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న ఒక స్త్రీని అదుపులోకి తీసుకుని ఆమె వద్ద నుంచి 13 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనపరుచుకుని అదుపులోకి తీసుకున్నట్లు సిఐ తెలిపారు.

ఒంటరి మహిళపై లైంగిక వేధింపులు

ఉండి : ఒంటరి మహిళపై ఇంట్లోకి చొరబడి లైంగిక వేధింపులకు పాల్పడిన ఏడుగురు వ్యక్తులపై ఉండి పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. దీనికి సంబంధించి ఉండి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉండి మండలం యండగండి గ్రామానికి చెందిన బలే శ్రీదేవి ఒంటరిగా నివసిస్తుండగా గత నెల 31వ తేదీన రాత్రి తాడి యాకోబు, మరో ఆరుగురు వ్యక్తులు కలిసి శ్రీదేవిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని శుక్రవారం ఉండి పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. ఈమేరకు ఎస్‌ఐ మహమ్మద్ నసీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ఆచంట

మూడు దశాబ్దాల అనంతరం కలుసుకున్న పూర్వ విద్యార్థుల ఆనందానికి అవధులు లేవు. ఎంతో ఆత్మీయంగా పలకరించుకొని పులకరించి పోయారు. ఆచంట మండలం వల్లూరు ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1980-81 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు ఆ పాఠశాల ఆవరణలో శుక్రవారం కుటుంబ సమేతంగా కలుసుకొని ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. దీంతో ఆ పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం ఏర్పడింది. కుటుంబ విషయాలు ఉద్యోగం, వ్యాపార విషయాలు ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాటి గురువులను ఘనంగా సన్మానించి సత్కరించారు. అనంతరం పూర్వ విద్యార్థులు సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, నరసింహం, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాట్ల శ్రీదేవి ట్రస్ట్ సేవలు అభినందనీయం

పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ మాజీ ఛైర్మన్ శివరామరాజు


డాక్టర్ వెంకట రామరాజుకు సత్కారం

కాళ్ల : దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని కాళ్ల పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ మాజీ ఛైర్మన్ గోకరాజు శివరామరాజు(శివబాబు) అన్నారు. కాళ్లకూరు గ్రామంలో మేరీమాత విగ్రహం ఏర్పాటు చేసి 15 సంవత్సరాలైన సందర్భంగా మేరీమాత వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్టు అధినేత దాట్ల డాక్టర్ వెంకట రామరాజు ఆర్థిక సహకారం రూ.4.50 లక్షలతో నిర్మించిన మేరీమాత పున:నిర్మాణ మందిరాన్ని ప్రారంభించారు. తొలుత మేరీమాత పున:నిర్మాణ మందిర ప్రారంభ శిలాఫలకాన్ని గోకరాజు శివరామరాజు(శివబాబు) ఆవిష్కరించారు. దాట్ల డాక్టర్ వెంకటరామరాజు ఆర్థిక సహకారంతో వేలాది మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం దాట్ల డాక్టర్ వెంకట రామరాజును సత్కరించారు. టిడిపి మండల అధ్యక్షులు గుండాబత్తుల వెంకట నాగేశ్వరరావు, దేవస్థాన మాజీ ఛైర్మన్ అడ్డాల నాగరాజు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ బహుజన సమైక్య వ్యవస్థాపకులు సోడదాసి గంగయ్య, ఫాదర్లు లక్కపాముల డేవిడ్, తోట గాబ్రియేలు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చర్యలు

కలెక్టర్ నాగరాణి

భీమవరం : తల్లీబిడ్డ మరణానికి కారణమైన సంబంధిత అధికారులపై కఠినమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినా, ప్రోత్సహించినా చర్యలు తప్పవన్నారు. ఆడపిల్లల నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాల్లో నిఘాతో పాటు ఆకస్మిక తనిఖీలు చేయాలన్నారు. మాతా, శిశుమరణాలు నూరుశాతం నిరోధానికి గట్టి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ నాగరాణి అధ్యక్షతన మాతృ మరణాలు, శిశు మరణాలు, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం అమలు, సంతాన సాఫల్య కేంద్రాలపై జిల్లా అదనపు ఎస్‌పి వి.భీమారావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో కొత్తగా నలుగురు అల్ట్రా స్కానింగ్ సెంటర్ల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోగా, భీమవరం, పాలకొల్లు, తణుకు, నరసాపురం స్కానింగ్ సెంటర్లను ఆమోదించడం జరిగిందన్నారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి స్కానింగ్ సెంటర్లు రెన్యూవల్ కోసం వచ్చిన దరఖాస్తుల్లో భీమవరం, పాలకొల్లు, తణుకు, నరసాపురం స్కానింగ్ సెంటర్ల దరఖాస్తులను ఆమోదించడం జరిగిందన్నారు. జూలై నుంచి సెప్టెంబరు వరకు సంభవించిన మాతృ మరణాలలో యలమంచిలి మండలం మేడపాడు, పెంటపాడు మండలం ముదునూరు నుంచి నమోదైన రెండు కేసులను విచారించారు. జూలై నుంచి సెప్టెంబరు వరకు నాలుగు శిశుమరణాలు సంబంధించగా భీమవరం మండలం తుందుర్రు, పెనుమంట్ర మండలం మార్టేరు, తాడేపల్లిగూడెం మండలం మాధవరం, యలమంచిలి మండలం దొడ్డిపట్ల గ్రామాల బాధిత కుటుంబ సభ్యులు, వైద్యాధికారులు, సూపర్వైజర్లు, ఆశా వర్కర్లతో మాతృ మరణాలు, శిశు మరణాలపై విచారణ చేసి జిల్లా కలెక్టర్ తగు సూచనలు జారీ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్‌పి వి.భీమారావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు, డిసిహెచ్ డాక్టర్ పి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌కు ఆసుపత్రులు పెంచండి

ఆకివీడు : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 70 సంవత్సరాల పైబడిన వారికి రూ.5 లక్షల పైబడిన వైద్య సహకారం అందించే ఆయుష్మాన్ భారత్ పథకానికి ఆసుపత్రుల సంఖ్య పెంచాలని వృద్ధుల సంఘ రాష్ట్ర సలహాదారు, వినియోగదారుల సంఘాల రాష్ట్ర సమాఖ్య సహాధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య డిమాండ్ చేశారు. ఈ పథకం అభినందనీయమైనదని, అందుకు అవసరమైన ఆసుపత్రులు లేకపోవడంతో పథకం ఫలించడం లేదన్నారు. 50 లక్షల మందికిపైగా అర్హులు ఉన్న రాష్ట్రంలో ఒక మంగళగిరి ఆసుపత్రి మాత్రమే ఈ పథకానికి వైద్య సహాయం లభిస్తుందని ఆయన తెలిపారు. ప్రతి జిల్లాలో ఆరోగ్యశ్రీ తరహాలో ఆయుష్మాన్ పథకానికి కూడా ఆసుపత్రులకు అవకాశాలు కల్పించాలన్నారు.

సిఎం సహాయనిధి పేదల పాలిట వరం

నరసాపురం: సిఎం సహాయనిధి పేదల పాలిట వరమని నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. శుక్రవారం నరసాపురం పట్టణంలోని జనసేన కార్యాలయంలో లబ్ధిదారులకు సిఎం సహాయనిధి చెక్కులు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజుతో కలిసి చెక్కులు అందజేశారు. మొగల్తూరు మండలం కేపిపాలెం గ్రామం ముంగండ జెజిబాబు అనే వ్యక్తికి అనారోగ్యం కారణంతో ఆపరేషన్ జరుగగా వైద్య ఖర్చుల నిమిత్తం నాయకర్ సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.6,01,543 చెక్కు రూపంలో అందించారు. మొగల్తూరు మండలం పిప్పళ్ల వారి తోటకు చెందిన పిప్పళ్ల నాగలక్ష్మికి అనారోగ్య కారణంగా ఆపరేషన్ జరుగగా వారికి కూడా ఎంఎల్‌ఎ నాయకర్ సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.40 వేలు చెక్కు రూపంలో అందించారు. ఈ కార్యక్రమంలో ఆకన చంద్రశేఖర్, వాతాడి ఉమా, నిప్పులేటి తారకరామారావు, జక్కం శ్రీమన్నారాయణ, అందే దొరబాబు, బందెల ఎలీషా, ఆజా, పిప్పల సత్య, పోలిశెట్టి సాంబ పాల్గొన్నారు.

విద్యుత్ కోతతో ప్రజల అవస్థలు

ప్రజాశక్తి - నరసాపురం

కార్యాలయం వద్ద వేచి ఉన్న ప్రజలు

పట్టణంలో సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం విద్యుత్ కోతతో రిజిస్ట్రేషన్‌కి వచ్చిన ప్రజలు అవస్థలు పడ్డారు. విద్యుత్ అధికారులు సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం, వివిధ మరమ్మతులు, ట్రీ కటింగ్ పనుల నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి ఒంటిగంట వరకు కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని విద్యుత్ శాఖ అధికారులు ప్రకటన చేశారు. అయితే ఒంటిగంట పూర్తయినప్పటికీ 2.30 నిమిషాల వరకూ విద్యుత్ రాకపోవడంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద విద్యుత్ సరఫరా లేకపోవడంతో రిజిస్ట్రేషన్‌కి వచ్చిన ప్రజలు నానా అవస్థలు పడ్డారు. రెండవ శనివారం, ఆదివారం కావడంతో శుక్రవారం నాడు పెద్ద ఎత్తున రిజిస్ట్రేషన్ చేసేందుకు ప్రజలు కార్యాలయానికి తరలివచ్చారు. దీంతో రిజిస్ట్రేషన్ కార్యాలయం కిటకిటలాడింది. తహశీల్దార్ కార్యాలయంలో విద్యుత్ లేకపోవడంతో ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసేందుకు కరెంట్ లేకపోవడంతో సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేత ప్రకటనలు ప్రజలకు తెలియకుండా చేస్తున్నారని మండిపడుతున్నారు. సెలవు రోజుల్లో ట్రీ కటింగ్ పనులు చేపట్టుకోవాలని ప్రజలు సూచిస్తున్నారు. శుక్రవారం విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కోల్పోతుందని, ఈ విషయాన్ని విద్యుత్ శాఖ అధికారులు గమనించాలని ప్రజలు కోరుతున్నారు.

రేషన్ బియ్యం పక్కదారి పడితే చర్యలు

తహశీల్దార్ రాజరాజేశ్వరి

ప్రజాశక్తి - నరసాపురం

ప్రజా పంపిణీ వ్యవస్థలో పేదలకు అందించే రేషన్ బియ్యం పక్కదారి పడితే సంబంధిత డీలర్లపై కేసులు పెడతామని తహశీల్దార్ టి.రాజరాజేశ్వరి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని మర్రితిప్ప, ధర్బరేవు రేషన్ డిపోలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. లబ్ధిదారుల కార్డులు, స్టాక్ వివరాలు ఇప్పటి వరకు ఎంత మందికి ఇచ్చారన్న విషయాలపై ఆరా తీశారు. ప్రతి డిపోలో బియ్యంతో పాటు తక్కువ ధరకు కందిపప్పు, పంచదార వస్తువుల్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. కావున వీటిని తీసుకెళ్లాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. డిపో పరిధిలో ఉన్న ప్రతికార్డుదారుడికి బియ్యం, ఇతర వస్తువులు అందించాలన్నారు. స్టాక్‌లో తేడాలు ఉంటే చర్యలు తప్పవన్నారు. రెండు రేషన్ షాపుల్లో వ్యత్యాసాలు ఉండటంతో ఇరువురు రేషన్ డీలర్లపై కేసు నమోదు చేశామని తెలిపారు. తహశీల్దార్ వెంట సివిల్ సప్లై డిటి అయితం సత్యనారాయణ, ఇన్‌ఛార్జి ఆర్‌ఐ లక్ష్మీనారాయణ, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

హోటళ్లపై సివిల్ సప్లయీస్ అధికారుల మెరుపు దాడి

ఏడుగురిపై 6(ఎ) కేసు నమోదు : 35 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం పట్టణంలో తహశీల్దార్, సివిల్ సప్లై ఆర్‌ఐ ఆధ్వర్యంలో శుక్రవారం పలు హోటల్స్‌పై మెరుపుదాడులు చేసి అక్రమంగా గృహ అవసరాలకు వినియోగించవలసిన గ్యాస్ సిలిండర్లు హోటల్స్‌లో వాణిజ్య వ్యాపారాలకు వినియోగిస్తున్నట్లు గుర్తించి ఏడుగురిపై కేసు నమోదు చేసి, 35 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై 6(ఎ) కింద కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లై ఆర్‌ఐ సురేష్ తెలిపారు. అజంతా క్యాంటీన్-5, హోటల్ సుప్రభాత్-9, అల్మాస్ రెస్టారెంట్-3, చంద్రిక ఫ్యామిలీ రెస్టారెంట్-2, సాయిరామ్ గ్యాస్ పిల్లింగ్ షాప్-3, శ్రీకృష్ణ లైట్స్ గ్యాస్ పిల్లింగ్ షాప్-4, శ్రీ అడపా రామకృష్ణ గ్యాస్ పిల్లింగ్ షాప్-9 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ముగిసిన మహిళా బ్యాడ్మింటన్ టోర్నమెంట్

ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ మహిళల షటిల్ బ్యాడ్మింటన్ జట్టు

పాలకొల్లు : ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం, అంతర కళాశాలల మహిళా బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పాలకొల్లు శ్రీదాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రెండురోజుల పాటు జరిగి శుక్రవారం ముగిశాయి. ఈ పోటీలలో గవర్నమెంట్ కాలేజ్(అటో) రాజమండ్రి మొదటి స్థానంలో నిలిచింది. ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల తణుకు, సిఆర్ రెడ్డి కళాశాల ఏలూరు, వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచారని కళాశాల ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎల్.రమేష్ తెలిపారు. వారికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శోభారాణి, ప్రభుత్వ వ్యాయామ కళాశాల ప్రిన్సిపల్ నతానియేలు, పాలకొల్లు వాకర్స్ క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకర్ చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేశారు. **యూనివర్సిటీ జట్టు :** ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ మహిళల షటిల్ బ్యాడ్మింటన్ టీంను పాలకొల్లులో ఎంపిక చేశారు. యూనివర్సిటీ బాడ్మింటన్ టీంకు కుమారి అంజనీ దేవి, సాయి రత్న, రేణుశ్రీ, నాగ దుర్గా భవాని, యమునా పద్మావతిలను ఎంపిక చేశారు. స్టాండ్ బై ప్లేయర్స్‌గా నాగలక్ష్మి, శ్రియలను యూనివర్సిటీ అబ్జర్వర్ నతానియేలు, సెలక్షన్ కమిటీ మెంబర్లు రత్నకుమారి, సుమతి ఎంపిక చేశారని తెలిపారు. వీరు నవంబర్ 26వ తేదీన కర్నాటకలోని దావణగెరెలో జరిగే సౌత్ జోన్ బాడ్మింటన్ టోర్నమెంట్‌లో యూనివర్సిటీ తరుపున పాల్గొంటారని పాలకొల్లు ప్రిన్సిపల్ తెలిపారు.

ఎస్‌కెఎస్‌డి విద్యార్థుల ప్రతిభ

తణుకు : ఆదికవి నన్నయ యూనివర్సిటీ బ్యాడ్మింటన్(ఉమెన్) ఇంటర్ కాలేజియేట్ కమ్ యూనివర్సిటీ సెలక్షన్స్ ఈనెల 7వ తేదిన డిఎన్‌ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్ పాలకొల్లులో జరిగాయి. సౌత్‌జోన్, ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్‌లో ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల విద్యార్థులు బి.రేణుశ్రీ, యుఎన్.భవానీ ఇద్దరూ ద్వితీయ స్థానం సాధించి ఈనెల 27న శ్రీధర్మస్థల ముంజునాదేశ్వర కాలేజ్, కర్ణాటకలో జరిగే పోటీల్లో హాజరౌతారని కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ యు.లక్ష్మీసుందరీబాయ్ తెలియజేశారు. ఈ సందర్భంగా సుందరీబాయ్ మాట్లాడుతూ బి.రేణుశ్రీ, యుఎన్‌డి.భవానీ, ఎం.మౌనిక, బి.నాగలక్ష్మీదుర్గ, ఎం.రాణిఖ్యాతరీ విజేతల టీం వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ ఎం.రత్నకుమారి పాల్గొన్నారు.

వైఎన్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

నరసాపురం : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన అంతర్ కళాశాలల మహిళా బ్యాడ్మింటన్ పోటీలలో శ్రీవైఎన్ కళాశాల నాలుగో స్థానం లభించింది. ఈ పోటీల్లో జి.స్నేహ శివాని, బి.ఢిల్లీశ్వరి, పి.దుర్గ, కె.రోజా పాల్గొన్నారు. ఇటీవల నిర్వహించిన వివిధ క్రీడా మహిళ కబడ్డీ పోటీల్లో టి.రజిత, చెస్ పోటీల్లో ఎండి ఫర్ హాన్ తమిళనాడులో నిర్వహించబోయే అంతర విశ్వవిద్యాలయ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చినిమిల్లి సత్యనారాయణ రావు, కోశాధికారి పోలిశెట్టి శ్రీ రఘు రామారావు, ప్రిన్సిపల్ సిహెచ్.కనకారావు, వైస్ ప్రిన్సిపల్ బి.వెంకటరత్నం, పీజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.చింతారావు, డీన్ డాక్టర్ గంధం శ్రీరామకృష్ణ అభినందించారు.

104 ఉద్యోగుల ధర్నా విజయవంతం చేయాలి

భీమవరం : 104 ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆదివారం భీమవరం ఎంపిడిఒ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో 104 ఉద్యోగులందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్ఎం.విజయ్ కుమార్, వి.సురేష్ పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో విజయ్ కుమార్ అధ్యక్షతన జిల్లా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 104 ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ఆదివారం అన్ని జిల్లా కేంద్రాల్లో ఆందోళన చేయాలని పిలుపునిచ్చారు. నెలల తరబడి జీతాల బకాయిలు, ఉద్యోగ భద్రత లేకపోవడం, పిఎఫ్ పేరుతో ఉద్యోగుల నుంచి విపరీతమైన వసూళ్లు, సుప్రీంకోర్టు తీర్పు కనుగుణంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వకపోవడం వంటి అనేక సమస్యలతో ఉద్యోగులు నేటికీ ఇబ్బంది పడుతున్నారన్నారు. 104 ఉద్యోగుల సమస్యల పట్ల చేస్తున్న దశల వారి ఆందోళనకి ఉద్యోగ కార్మిక సంఘాలన్నీ మద్దతు ఇవ్వాలని సమావేశం పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు సుందర్ సింగ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్, కమిటీ సభ్యులు కె.సురేంద్ర, పి.అశోక్, జి.శ్రీను కుమార్ పాల్గొన్నారు.

బాలికలకు అభినందన

భీమవరం : అంతర్జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలో వివిధ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీల్లో పాల్గొని గెలుపొందిన 9 మంది బాలికలకు రూ.30 వేలు నగదు, జ్ఞాపికలను, ప్రశంసా పత్రాలను శుక్రవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అందజేశారు. కలెక్టర్ చేతుల మీదుగా సంబంధిత విద్యార్థులకు నమూనా చెక్కును, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులను అభినందిస్తూ చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు, డిప్యూటీ డెమో పి.అనంతలక్ష్మి పాల్గొన్నారు.

బీచ్‌లో బందోబస్తు నిర్వహించాలి

మొగల్తూరు : బీచ్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా సిబ్బంది బందోబస్తు నిర్వహించాలని డిఎస్‌పి మురళీకృష్ణ సూచించారు. మండలంలోని పేరుపాలెం బీచ్ ప్రాంతాన్ని శుక్రవారం ఆయన సందర్శించి భారీ కేడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. పేరుపాలెం బీచ్‌కు వచ్చే పర్యాటకులు ప్రమాదాల బారిన పడకుండా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. ఆయన వెంట సిఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ జి.వాసు ఉన్నారు.

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No: 46/2020
చెన్నుపాటి కామాక్షమ్మ .... మరికొందరు వాదులు
V/s
పాలేరు శ్రీరామకృష్ణ మరికొందరు...... ప్రతివాదులు
To
D5) రామినేని వాణిశ్రీ W/o వెంకటేశ్వరరావు, అల్లూరి సీతారామరాజు మెడికల్ కాలేజి, ఏలూరు పట్టణం, వెస్ట్ గోదావరి జిల్లా.
పై నంబరు దావాని వాది డిక్లరేషన్ మరియు స్వాధీనము చేయమని కోరుచూ దావా దాఖలా చేసి మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారని శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల మేరకు మీరు తేది 26-11-2024 న ఉదయం 10:30 నుండి సాయంత్రం 5 గంటల లోపు పై కోర్టు వారు ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకొనేది. లేనిచో దావాని నీ పరోక్షముగా తీర్మానింపబడును.
// కోర్టు వారి ఉత్తర్వులతో//
మోతుకూరి సుభాష్ బాబు
మురకొండ చంద్రశేఖర్
అడ్వకేట్స్, అద్దంకి.

IN THE COURT OF THE FIRST ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) TANUKU
I.A.329/2023 & I.A.539/2020 in O.S.640/2020 and O.S.640/2020
Between:
Padala Satyanarayana Reddy
...Petitioner & Plaintiff
And
Mudundi Subbalakshmi & Others
...Defendants & Respondents
D3: Chiluvuri Manideepika, W/o.Seeta Rama Raju, R/o.Oduru (Penumantra Mandalam).
వాది మరియు పిటీషనర్ తరపున వేయించిన ప్రకటన
ఇందుమూలముగా 3వ ప్రతివాది / రెస్పాండెంట్‌కు పైనంబరు గ్రంథములో కోర్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినా మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీకోర్టు వారు నోటీసు పేపరు ప్రకటన ద్వారా ఆర్డరు వేసియున్నారు. కావున మీరు **ది.22-11-2024వ** తేదీన ఉదయం 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ, లాయరు ద్వారా గానీ హాజరు అయి అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షములో దావా మరియు పిటీషన్‌లు విచారణ చేసి తీర్మాణం చేయబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
శ్రీకోర్టు వారి ఉత్తర్వుల మేరకు
గుడిమెట్ల వీర్రెడ్డి
తణుకు — వాది తరపు న్యాయవాది
ది.04-11-2024 — సెల్: 9440607793

ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No.37/2016
బిట్వీన్:
చిటికిన సూర్యచంద్రరావు (డైడ్)
చిటికిన పార్వతి అండ్ అదర్స్
...వాదులు
మరియు
వేముల కృష్ణ మూర్తి అండ్ అదర్స్
...ప్రతివాదులు
టు: శ్రీమతి అంగర వనరాజ్యలక్ష్మి, భర్త: గోవిందు, C/o.తండ్రి: చిటికిన పార్వతి, డో.నెం.8-104/2, గౌడపేట, మోర్త గ్రామం, ఉండ్రాజవరం మండలం, తణుకు పి.జె.సి.జె.
పై నెంబరు గ్రంథములో మీకు శ్రీ కోర్టు ద్వారా ఎన్నిపర్యాయములు (నోటీసులు) సమన్లు పంపి యున్నప్పటికీ మీరు తీసుకోవటం లేదు అని శ్రీ పై కోర్టు వారు ఈ పేపరు ప్రకటన ద్వారా ది.12-11-2024న ఉదయం గం॥10:30 ని॥లకు హాజరు కమ్మని ఆర్డరు వేసియున్నారు. మీరు **ది.12-11-2024న ఉదయం గం॥10:30 ని॥లకు మీరు స్వయంగా గాని లేక ప్లీడరు ద్వారా కాని హాజరు అయ్యి ఏమైనా ఆక్షేపణలు ఉన్నచో తెలియపర్చుకొనవలెను.** లేని ఎడల మీ పై పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్పుచెప్పబడును.
P.PADMAVATHI
B.SRINIVASA PRASAD
Advocates,
Tadepalligudem, Pentapadu.
Tadepalligudem,
01-11-2024.

పాస్‌పోర్టు పోయినది
ఏలూరు జిల్లా, పెదపాడు మండలం, కొత్తూరు గ్రామానికి చెందిన కస్సే జ్యోతి అను నేను ఏలూరు జిల్లా, కొత్తూరు గ్రామం నుండి కొత్త ముప్పర్రులో మా బంధువుల ఇంటికి మోటారు సైకిల్ పై వెళ్ళు చుండగా మార్గమధ్యలో పాస్‌పోర్టు నెం. **H9066198 పడిపోయినది.** నేను బంధువుల ఇంటికి వెళ్ళిన తరువాత చూసుకుంటే నా ఒరిజినల్ పాస్‌పోర్టు కనిపించలేదు. మార్గమధ్యలో వెతికి చూసినా కనిపించలేదు. దొరికిన వారు ఈ క్రింది చిరునామాకి తెలియజేయగలరు.
కస్సే జ్యోతి
డో.నెం.1-3, అంబేద్కర్ బొమ్మ దగ్గర, కొత్తూరు, పెదపాడు మండలం, ఏలూరు జిల్లా. సెల్: 9618443023

ప్రకటన
నా క్లయింటు పొట్లూరి శ్రీనివాస సత్య కుమార్ అను వారికి ఏలూరు జిల్లా, పెదపాడు మండలం, కలపర్రు గ్రామ పంచాయితీలో చేరిన గోగులపాడు గ్రామంలోని **ఆర్.ఎస్.నెం.211,213/2** ర్లు దాఖలా చ.గ.200.22ల స్థలమునకు చెందిన క్రయ దస్తావేజు నెం.12297/2017 రుగా సంక్రమించినది. సదరు దస్తావేజును తీసుకుని ఏలూరు పెద్ద పోస్టాఫీసు సమీపంలోని జిరాక్స్ షాపులో జిరాక్స్ తీసుకుని వెళ్తుండగా **ది.5-11-2024వ** తేదీన మార్గమధ్యలో సదరు దస్తావేజు పోయినది. ఎంత వెతికినా దొరకలేదు. సదరు దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల నాకు గానీ నా క్లయింటుకు గాని అప్పగించగలరు.
ఏలూరు — కె.వి.పి.మాధవరావు
తేది.8-11-2024 — అడ్వకేట్, నోటరీ
సెల్ : 9440111033

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి :: ఏలూరు
F.D.I.A.No.1945/2008, O.S.No.7/1993
బిట్వీన్:
కొసరాజు వీరవెంకట వరప్రసాద్
...పిటీషనరు /వాది
మరియు
కొసరాజు వెంకట నారాయణ (డైడ్) వగైరాలు
...రెస్పాండెంట్స్
పిటీషనరు /వాది దాఖలు చేసిన పబ్లికేషన్
పై నెంబరు గల ఫైనల్ డిక్రీ పిటీషనులో 9వ రెస్పాండెంటు అయిన మండలపు హరిత, తండ్రి: కొసరాజు పెదసుబ్బయ్య, ప్లాట్ నెం.20, శ్రేయ అపార్ట్‌మెంట్, కె.కె.టవర్స్, సత్రంపాడు, ఏలూరు, ఏలూరు జిల్లా అను వారికి **ది.20-11-2024వ తేదీ ఉదయం గం॥10:30 ని॥లకు పై కోర్టులో స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరయ్యి తమ ఆక్షేపణలు తెలియ పర్చుకొనవచ్చును.** లేని ఎడల సదరు పిటీషను తమ పరోక్షమందు విచారించి తీర్మానం చేయుదురని ఇందు మూలముగా తెలియచేయడమైనది.
ఆవుల జగన్మోహనరావు
పుప్పాల రామకృష్ణ
ఏలూరు, — అడ్వకేట్స్, అశోక నగర్,
08-11-24. — ఏలూరు, ఏలూరు జిల్లా.

In The Court Of The Prl. District Judge, Eluru
F.D.P.No.561/2024, O.S.No.66/2022
Between:
Kuppala Satyavathi
...Petitioner /Plaintiff
AND
Kuppala Chiranjeevi and Others
...Respondents /Defendants
TO: R-2:
Kuppala Tejo Muurthy, S/o. Late Kupa Pentiah, Hindu, Male, Aged about 39 Years, Tapi Mastry, R/o. D.No.28-3-10A, Piranngula dibba, Eluru, W.G.Dist, Eluru JCJC.
కోర్టు ప్రకటన
పై నెంబరు గల ఎఫ్.డి.పి.నెం. 561/2024లో 2వ రెస్పాండెంటు గారికి ఎన్నిసార్లు కోర్టు నోటీసులు పంపినను పుచ్చుకోకుండా కాలయాపన చేయు చున్నందున శ్రీ కోర్టు వారు నోటీసులు అమలు నిమిత్తం 2వ రెస్పాండెంటు కు ఆర్డరు వేసినారు. కావున పై వారికి ఏమయినా ఆక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టు ఎదుట **ది.20-11-2024వ తేదీ ఉదయం గం॥10:30 ని॥లకు హాజరు కావలెను. లేనిచో మీ పరోక్షమున తీర్పు చెప్పబడును.**
NEKKARAGANTI NARASIMHA RAO
Eluru, — Advocate, Eluru
01-11-2024 — Cell: 9848118984

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.A.No.76/2019 in O.S.No.322/1996
ఆకెళ్ళ అగ్ని హోత్రుడు (డైడ్) వగైరా
...Petitioner/Dhrs
Petitioner/Dhrs 2 to 5 being represented by regd. G.P.A. Medapati Gangadhara Subrahmanyeswara Reddy)
మరియు
పాలపర్తి సరోజినీ డైడ్ వగైరా
...Respondents/Jdrs
To.
1.పాలపర్తి విజయశేఖర్, S/o.లేటు భాస్కరరావు, డోరునెంబర్.8-25, చినపేట లంకలకోడేరు, పాలకొల్లు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా. పిన్:534250. Respondent No.3
2.పిల్లి ఎస్తేరు విజయకుమారి, భర్త విజయకుమార్, 129 MP, ఎలిమెంటరి స్కూల్ దగ్గర, RVM Buildings Housing Colony, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా.534201. Respondent No.4
3.ఇసుకపట్ల రాజ్యలక్ష్మి, భర్త కిశోరు, 166 అంగన్‌వాడీ సెంటర్ దగ్గర, తాడి వీధి, పోలీస్ క్వార్టర్స్ దగ్గర, ఇసకతోట, విశాఖపట్నం జిల్లా - 530022 Respondent No.5
మీ పై, పై పిటీషనరు పై కోర్టులో పై దావా ఆస్తిని బహిరంగ వేలము వేయించుట మూలముగా దావా డిక్రీ బాకీ వసూలు చేయు నిమిత్తం మీ పై పై నెంబరు పిటీషన్ దాఖలు చేసినందున సదరు దావాలో 3,4 మరియు 5వ Respondents/JDrs అయిన మీకు పలుమార్లు కోర్టు ద్వారా నోటీసులు పంపించినను, ఉద్దేశ్య పూర్వకంగా త్రిప్పిపంపించి వేసినందున శ్రీపైకోర్టు వారు పై Respondents అయిన మీ యొక్క హాజరు నిమిత్తం పత్రికలో ప్రకటన చేయవలసినదిగా ఆర్డర్ జారీ చేసినారు. సదరు ఆర్డరు ప్రకారం సదరు పిటిషను ది.**28-11-2024** తేదికి వాయిదా అయి వున్నది. కాబట్టి మీరు స్వయముగా గాని, న్యాయవాది ద్వారా గాని పైకోర్టు వారి ఎదుట ఉదయం 10.00 గంటల నుండి హాజరై ఆక్షేపణలు తెలియచేసుకొనవలెను. లేనియడల మీ పరోక్షమున పై పైపిటిషను తీర్మానం చేయబడును.
//Order of Court//
నర్సాపురం — **రామారావు పొన్నమండ**
తేది.08-11-2024 — అడ్వకేట్, నర్సాపురం.